దశ
నిజం.. నిర్భయంగా..
గురువారం
28-05-2026

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాలేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM




# అటవీ, రెవెన్యూ సమస్యలపై సమగ్ర సమీక్ష

❖ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ, భద్రచలం:** తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ), భద్రాచలం నిర్వహించిన అటవీ & రెవెన్యూ సమస్యల సమగ్ర సమీక్ష సమావేశం లో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించే ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహించబడింది.

సమావేశంలో ముఖ్యంగా గిరిజనులకు సంబంధించిన భూ హక్కుల సమస్యలు, పోడు భూముల అంశాలు, సాగుభూముల పట్టాలు, అటవీ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల సవరణ, భూవివాదాలు మరియు గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గిరిజన ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ప్రజలకు న్యాయం జరిగే విధంగా పారదర్శకంగా వ్యవహరించి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదేవిధంగా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్, విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు మరియు ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటిడిఎ పీవో రాహుల్, కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు, అటవీ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన నాయకులు, గ్రామ పెద్దలు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా రంగంలో వీరణాల నాగు మానవత్వం

❖ ఆపదలో ఉన్నవారికి వీరణాల నాగు ఆర్థిక సాయం



**దశ, అశ్వారావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన ఆటో మెకానిక్ వీరణాల నాగు తన సేవా కార్యక్రమాలతో ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రమాదాలు, అనారోగ్యాలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్కర పరిస్థితుల్లో ఉన్న బాధితులకు దాతల సహకారాన్ని సమీకరించి అండగా నిలుస్తున్నారు.సోషల్ మీడియా, స్నేహితుల సహకారంతో విరాళాలు సేకరించి పలువురికి ఆర్థిక సహాయం అందించారు. ప్రమాదంలో చేయి కోల్పోయిన మహిళకు రూ.1 లక్ష, గాయపడిన యువకుడికి రూ.75 వేల సహాయం అందేలా కృషి చేశారు. అగ్ని ప్రమాద బాధితురాలికి రూ.7 వేల, అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి రూ.30 వేల, కామయ్యపాలెం గ్రామానికి చెందిన మహిళకు రూ.10,100 సహాయం అందజేశారు.రక్తదాన కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటూ అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన రక్తాన్ని సమీకరించి పలువురికి ప్రాణదాతగా నిలుస్తున్నారు. అలాగే ఆసుపాక పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, దాతల సహకారంతో సుమారు రూ.4 లక్షలు సేకరించి క్రీడా మైదానం అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, స్టేజ్ ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. "బాధితులు, దాతల మధ్య వారధిగా ఉండటం ఆనందంగా ఉంది" అని వీరణాల నాగు తెలిపారు. ఆయన సేవా కార్యక్రమాలను స్థానిక ప్రజలు, యువత, ప్రముఖులు అభినందిస్తున్నారు.

## పంచాయితీ కార్మికుల మహాధర్నా


❖ జయప్రదం చేయండి, సిఐటియు పిలుపు



**దశ, మునగాల:** గ్రామ పంచాయితీ కార్మికులను క్రమబద్ధీకరించి వారి వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య భవనంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మల్టీపర్పస్ వర్కర్ పని విధానాన్ని రద్దు చేయాలని కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆన్లైన్ లో గతంలో నమోదు కాని పేర్లను నమోదు చేయాలని అన్నారు. ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ జూన్ 1 న మండల కేంద్రాల్లో జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిపి వర్కర్స్ జిల్లా కమిటీ సభ్యులు ఎం వెంకటేశ్వర్లు, డి రవి కుమార్,టి ముత్తయ్య, టి చంద్రశేఖర్, జె బజార్, ఆర్ వెంకన్న, బి నర్సయ్య, డి రాజు, మల్సూర్, టి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

❖ వీఓఏల సమస్యలు పరిష్కరించండి: సీపీఐ నేత సరెడ్డి పుల్లారెడ్డి




**దశ, మునగాల:** గ్రామీణ ప్రాంతాలలో అహర్నిశలు శ్రమిస్తున్న ఐకేపీ వీఓఏల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మణుగూరు మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏ, ఐకేపీ కార్మికులు సంయుక్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ.. ఐకేపీ వీఓఏలు ఎన్నో ఏళ్లుగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతం చేయడంలో భాగస్వామ్యమవుతున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కనీస వేతనం రూ. 20,000 పెంచుతామని ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా ఆ హామీ అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస వేతనంతో పాటు వీఓఏలకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మార్కెట్లో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య కుటుంబాలు బతికే పరిస్థితి లేదని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పొద్దున ఉదయం నుండి సాయంత్రం దాకా కష్టపడి పనిచేస్తున్నా.. చేతికి వచ్చే వేతనం ఇల్లు గడవడానికి కూడా సరిపోక వీఓఏలు అప్పులపాలు కావాల్సి వస్తోందన్నారు.



## VOAల సమస్యలు పరిష్కరించాలి

❖ BRS పార్టీ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి

**దశ, పినపాక:** ఐకేపీలో పని చేస్తున్న విఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని BRS పార్టీ పినపాక మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన పినపాకలో వీఏఓల నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు నాయకులతో కలిసి వెళ్లి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలు అమలులో వారిది ప్రత్యేక పాత్ర అన్నారు. మహిళా సంఘాల సభ్యులా సీనియర్ గ్రామ దీపికలను సీసీగా గుర్తించాలని, జీఓ నెం. 58ను వెంటనే సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని, హెల్త్ పాలసీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు గుమ్మడి గాంధీ, కొండేరు రాము, బత్తుల వెంకటరెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, ముక్కు నాసర్ రెడ్డి, పోలిశెట్టి సత్తిబాబు, కొండేరు నాగభూషణం, చెన్నకేశవులు, బూరరమేష్, బూర సురేష్, రమేష్, ఆలవాల వెంకటేశ్వర్లు, యక్కంటి అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల శాతాన్ని పెంచాలి

❖ డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, గర్భిణీల రిజిస్టర్లు, టీకాల కార్యక్రమాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.గర్భిణీలకు ఈడీడీ క్యాలెండర్ ప్రకారం నిరంతర



పర్యవేక్షణ చేపట్టి,కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. రక్తపోటు, షుగర్, హీమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయడంతో పాటు హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలు జరిగేలా, సాధారణ కాన్పుల శాతం పెరిగేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ప్రస్తుతం తీవ్రమైన ఎండలు ఉన్నందున ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు బయటకు రావద్దని సూచించారు. డీహైడ్రేషన్ నివారణకు నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని చెప్పారు.అలాగే డెంగ్యూ, మలేరియా నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పల్స్ పోలియో కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేసేలా ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి కోయ్యలను కాల్చే వారిపై చట్టరీత్యా చర్యలు

❖ తహసిల్దార్ సరిత



**దశ, మునగాల:** పంట పొలాల్లో వరి కొయ్యలను కాల్చేవారిపైచట్టరీత్యాచర్యలుతీసుకోబడతాయని తహసిల్దార్ సరిత అన్నారు. బుధవారం మునగాల గ్రామ శివారులోని గణపవరం రోడ్డులోని వరి కొయ్యలు కాల్చిన పొలాన్ని స్థానిక ఎంపీడీవో రమేష్ దీన దయాల్, మండల వ్యవసాయ అధికారి రాజు, ఎంపిఓ నరేష్ నరేష్ తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూరైతులు వ్యవసాయ భూముల్లో వరి కొయ్యలకు నిప్పుపెట్టడం ద్వారా తీవ్రమైన మంటలు వ్యాపించి ఆ మంటలు పక్క పొలం వారి వరి కోయ్యలకు అంటుకొని అగ్నిప్రమాదాలకు దారితీస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా రైతుల విలువైన కరెంటు వైర్లు, మోటర్లు, స్టార్టర్లు పైపులైన్లు, ఇతరవ్యవసాయ పనిముట్లు దగ్ధమవుతాయని అన్నారు. దాంతో విలువైన వృక్ష సంపద జంతుజాలం పచ్చని చెట్లు గడ్డివాములు మంటల్లో కాలిపోతున్నాయని అన్నారు. ఆ మంటలు కాస్త ఊరి మీదికి వస్తు జనజీవనానికి మరియు ఇండ్లకు అంటుకొని పెను అగ్ని ప్రమాదానికి దారితీస్తున్నాయని తెలిపపారు. కాబట్టి రైతులు ఎవరు కూడా వరికోయలకు మంట పెట్టవద్దని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ వరికోయకాలకు మంట పెట్టినట్లయితే అట్టి వారిపై ప్రభుత్వం నిర్దేశించిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

అదేవిధంగా వరికొయ్య కాళ్లకు నిప్పు పెట్టడం ద్వారా వాయు కాలుష్యం ఏర్పడుతూ,భూమిలో ఉండే, పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు,మిత్రపురుగులు చనిపోతూ నేలసారవంతం తగ్గుతుందని, సేంద్రియ కార్బన్ తగ్గిపోవడంతో, భూమి గట్టి పడిపోయి తదుపరి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. వరికోయలను తగలబెట్టకుండా భూమిలోకలియ దున్నటంతో, వరికోయ్యల్లో ఉండే పోషకాలు భూమికి బలాన్ని ఇస్తూ సేంద్రీయ ఎరువుగా తయారై రైతులకు లాభదాయకం అవుతుందని ఆమె సూచించారు.